క్లుప్తంగా

వినాయక ఉత్సవాలకు అనుమతి తప్పనిసరి


ఎస్‌ఐ మల్లికార్జున్

వరదయ్యపాళెం: ఈ నెల 27 నుంచి ప్రారంభం కానున్న వినాయకచవితి ఉత్సవాల నిర్వహణకు అనుమతులు తప్పనిసరిగా పొందాలని ఎస్‌ఐ మల్లికార్జున్ తెలిపారు. ఆదివారం ఆయన పాత్రికేయులతో మాట్లాడారు. వినాయక విగ్రహాలను ఏర్పాటు చేసే ప్రాంతాలకు సంబంధించి కమిటీ సభ్యులు ముందస్తుగా ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేయాలన్నారు. అక్కడ ఏర్పాటు చేసే సౌండ్ సిస్టమ్‌కు కూడా అనుమతి పొందాలని, ఉత్సవాల్లో నిర్వహించే కార్యక్రమాలు, నిమజ్జన విషయాలను కమిటీ సభ్యులు ముందుగా తెలపాలని, ఉత్సవాల్లో అసాంఘిక కార్యక్రమాలు నిర్వహిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ప్రతిఒక్కరూ నిబంధనలకు లోబడి ఉత్సవాలను స్నేహపూర్వక వాతావరణంలో నిర్వహించుకోవాలన్నారు.

చేనేత కళాకారులకు ప్రశంసా పత్రాలు


కళాకారులకు ప్రశంసా పత్రాలు అందజేస్తున్న సంఘ నాయకులు

సత్యవేడు: ఆంధ్రప్రదేశ్ దేవాంగ అభ్యుదయ సేవా సంఘం కో–ఆర్డినేటర్ జక్కుల శివానందం ఆధ్వర్యంలో ఆదివారం చేనేత వృత్తి నిపుణులు, కళాకారులకు ప్రశంసా పత్రాలు అందజేశారు. సంఘం రాష్ట్ర ప్రతినిధి బండారు మోహన్‌బాబు, మండల ఇన్‌చార్జి జక్కుల రామచంద్ర ప్రోగ్రాం కో–ఆర్డినేటర్ ఈ కార్యక్రమం నిర్వహించారు. మన్నెం గిరికుమార్, మన్నెం చెంగల్వ రాయం, తనీష్‌కుమార్, మాచర్ల పద్మనాభం, మాచర్ల మన్నారు , కేశవులకు, వెంకటేశ్వర్లు ప్రశంసా పత్రాలు అందజేశారు.

ముక్కంటి సేవలో రామేశ్వరం ఎమ్మెల్యే


ఆలయం వద్ద రామేశ్వరం ఎమ్మెల్యే

శ్రీకాళహస్తి: జ్ఞానప్రసూనాంబ సమేత శ్రీకాళహస్తీశ్వరస్వామిని ఆదివారం రామేశ్వరం ఎమ్మెల్యే ఖాదర్‌బాషా అలియాస్ ముత్తు రామలింగస్ దర్శించుకున్నారు. దక్షిణ గోపురం వద్ద ఆలయ అధికారులు ఆయనకు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. వేద పండితులు ఆయన్ను ఆశీర్వదించి స్వామి అమ్మవార్ల జ్ఞాపిక, తీర్థప్రసాదాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ అధికారులు పాల్గొన్నారు.


కోలా ఆనంద్‌కు ఘన సన్మానం


సన్మానిస్తున్న బలిజసంఘం నాయకులు

శ్రీకాళహస్తి: బీజేపీ రాష్ట్ర ఉపాధ్యక్షులుగా కోలా ఆనంద్ ఎన్నికైన సందర్భంగా ఆదివారం ఆయన నివాసం వద్ద బలిజ సంఘం నాయకులు పలువురు ఆయన్ను ఘనంగా సత్కరించారు. వారు మాట్లాడుతూ కోలా ఆనంద్ మరిన్ని ఉన్నత పదవులు అలంకరించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో సిద్దులగారి ప్రసాద్, ఉప్పు కృష్ణయ్య, కృష్ణమూర్తి, గంగులపూడి సుబ్బారావు, నరేంద్రబాబు, సూరగారి రమేష్, గిరిధర్, మునిసుబ్బయ్య, భాస్కర్, ప్రసాద్, పురుషోత్తం, బాబు, హరికృష్ణ, ఆనంద్, నవీన్ కుమార్, ముని, అనిల్, సతీష్, శ్యామ్ పాల్గొన్నారు.

ఆకట్టుకున్న భరతనాట్యం

చంద్రగిరి: తిరుచానూరు సమీపంలోని శిల్పారామంలో వారాంతపు కార్యక్రమంలో భాగంగా ఆదివారం చెన్నైకు చెందిన శ్రీహరి అభినయ కృష్ణ భరతనాట్య ఇసైపల్లి ఆధ్వర్యంలో చిన్నారుల భరతనాట్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. గణపతి కౌతువం, ఆడం చిదంబరం, మూషిగ, జగత్ జాలు, పుష్పాంజలి, తిరుపుగజ్, అలరిప్పు, తదతగై తాండవం, సీతా కల్యాణం, శిలపతికారం.. తదితర పాటలకు కళాకారులు రక్షిత, ధన్య, సాయిజన, దియాడి జూటూరు, కావ్యశ్రీ, జయతి, వెన్నిక, అక్షర, లితిక, మురళీకృష్ణన్, కనిష్క, కృత్తిక తమ చక్కని అభినయం, హావభావాలతో ఆకట్టుకున్నారు. అనంతరం ఏటీ సూర్యతేజ కళాకారులను సత్కరించి, జ్ఞాపికలను అందజేశారు.


భరతనాట్యం చేస్తున్న కళాకారులు

ట్రాన్స్‌కో నిర్లక్ష్యం

ట్రాన్స్‌కో శాఖ నిర్లక్ష్యానికి రేయింబవళ్లూ వీధిలైట్లు వెలుగుతూనే ఉన్నాయి. ఫలితంగా విద్యుత్ వృథా అవుతోంది. గ్రామ పంచాయతీలకు సైతం బిల్లుల మోత మోగుతోంది. ఈ వృథాను నియంత్రించాల్సిన ట్రాన్స్‌కో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు.

- గ్రామాల్లో రేయింబవళ్లూ వెలుగుతున్న లైట్లు
- ప్రత్యేక లైను ఏర్పాటులో నిర్లక్ష్యం
- వృథా అవుతున్న విద్యుత్ వినియోగం


కురింజల్లంలో..


కోవూరుపాడులో పగలే వెలుగుతున్న వీధిలైట్లు

వరదయ్యపాళెం: మండలంలో 29 గ్రామ పంచాయతీలు ఉన్నాయి. వాటి పరిధిలో 100కు పైగా గ్రామాలున్నాయి. గ్రామ పంచాయతీలు ఆయా గ్రామాల్లో వీధి లైట్లు ఏర్పాటు చేయాల్సి ఉంది. అయితే ట్రాన్స్‌కో అధికారులు లైన్లు లాగే సందర్భంలో ప్రత్యేకించి వీధి లైట్ల కోసం ప్రత్యేక లైను ఏర్పాటు చేయాల్సి ఉంది. కొన్నిచోట్ల ఈ సౌకర్యం ఉన్నప్పటికీ మెజారిటీ గ్రామాల్లో వీధి లైట్లు నిర్వహణకు ప్రత్యేక లైన్లు లేవు.

వృథా అవుతున్న విద్యుత్

మండలవ్యాప్తంగా దాదాపుగా 70 గ్రామాలలో వీధిలైట్ల నిర్వహణ అస్తవ్యస్తంగా మారింది. వీధిలైట్లకు సంబంధించి ప్రత్యేక లైను లేకపోవడంతో లైట్లను రోజువారీ ఆఫ్ చేసే వీలు లేదు. దీంతో రాత్రింబవళ్ల నిరంతరంగా వెలుగుతుండడం వల్ల విద్యుత్ వృథా అవుతోంది.

పంచాయతీలకు బిల్లుల భారం

రాత్రింబవళ్ల గ్రామాల్లో వీధి లైట్లు నిరంతరం వెలుగుతున్న కారణంగా పంచాయతీలపై విద్యుత్ భారం అధికమవుతోంది. ప్రత్యేక లైను ఏర్పాటు చేయమని ట్రాన్స్‌కో అధికారులకు మొరపెట్టుకున్నా పట్టించుకోవడం లేదని సర్పంచులు వాపోతున్నారు. విద్యుత్ వృథా అవడమే కాకుండా నిరంతరంగా వెలుగుతున్న కారణంగా నూతనంగా వేసిన విద్యుత్ లైట్లు సైతం తక్కువ రోజులకే కాలిపోతున్నాయని సర్పంచులు గగ్గోలు పెడుతున్నారు. విధుల లేమీతో పంచాయతీ నిర్వహణ అంతంత మాత్రంగా ఉన్న పరిస్థితుల్లో శాఖ అధికారుల నిర్లక్ష్యానికి పంచాయతీల అధిక బిల్లులతో పాటు వీధిలైట్ల నిర్వహణ భారమవుతోందని మండిపడుతున్నారు.

పట్టించుకోవడం లేదు



వీధి లైట్లకు ప్రత్యేకించి గ్రామాల్లో లైన్లు ఏర్పాటు చేయమని ట్రాన్స్‌కో అధికారులకు వ్యక్తిగతంగా, సర్వసభ్య సమావేశాల్లో విన్నవించినా పట్టించుకోవడం లేదు. దీని కారణంగా ప్రతి స్తంభానికీ లైటు ఆపేందుకు స్విచ్ ప్రత్యేకంగా ఏర్పాటు చేసుకోవాల్సిన పరిస్థితి నెలకొంటుంది. ఇకనైనా అధికారులు స్పందించాలి.

–దుద్దు వేణు, సర్పంచ్, సీఎల్ఎన్ పల్లె

తక్కువ రోజులకే లైట్లు మటాష్



స్తంభాలకు వేసిన వీధిలైట్లు నిరంతరంగా వెలుగుతున్న కారణంగా వీధి లైట్లు తక్కువ రోజులకే వెలగడం లేదు.. కారణం లైట్లను రోజూ ఉదయం ఆపే పరిస్థితి లేకపోవడమే. దీంతో వేసిన 10రోజులకే లైట్లు పాడవడంతో స్థానిక ప్రజలు ఇబ్బంది పడుతున్నారు.

–బాలకృష్ణ, సర్పంచ్, పులివల్లం

బిల్లుల మోత తప్పడం లేదు



గ్రామ పంచాయతీలకు ట్రాన్స్‌కో అధికారుల నిర్లక్ష్యం పెనుభారమవుతోంది. పంచాయతీలలో వీధి లైట్ల నిర్వహణకు ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేయకపోవడంతో రేయింబవళ్లూ లైట్లు వెలుగుతుండడంతో పంచాయతీలకు లక్షల్లో బిల్లులు వస్తున్నాయి. దీనిపై సంబంధిత అధికారులు ఏమాత్రం పట్టించుకోవడం లేదు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి ప్రతి గ్రామంలో వీధిలైట్ల నిర్వహణకు ప్రత్యేక లైన్లు ఏర్పాటు చేయాలి.

–చంద్రారెడ్డి, మండల సర్పంచుల సంఘం అధ్యక్షుడు

నేడు పంచాయతీ షాపింగ్ గదుల వేలం

నాగలాపురం: 2025–26 సంవత్సరానికి సంబంధించి పంచాయతీ షాపింగ్ గదులకు సర్పంచ్ చిన్నదొరై సుధా ఆధ్వర్యంలో బహిరంగ వేలం నిర్వహిస్తున్నట్లు పంచాయతీ కార్యదర్శి శంకరయ్య తెలిపారు. స్థానిక బజారు వీధిలో గాంధీ విగ్రహం పక్కన నూతనంగా నిర్మించిన నాలుగు పంచాయతీ షాపింగ్ గదులు, అలాగే సన్నిధి వీధిలోని మూడు షాపింగ్ గదులకు సోమవారం మధ్యాహ్నం 2 గంటలకు పంచాయతీ కార్యాలయంలో వేలం నిర్వహిస్తామని, సాల్వెన్సీ సర్టిఫికెట్ పొంది, డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలన్నారు.

విద్యార్థులకు ఫ్లాస్కుల పంపిణీ


స్టీల్ వాటర్ ఫ్లాస్కులను పంపిణీ చేస్తున్న సర్పంచ్ శ్యామల, సుబ్రమణ్యం

వరదయ్యపాళెం: మండలంలోని చిన్న పాండూరు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలకు చెందిన విద్యార్థులకు అపోలో టైర్స్ ఫౌండేషన్, హెల్త్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో స్టీల్ వాటర్ ఫ్లాస్కులు పంపిణీ చేశారు. ప్లాస్టిక్ బాటిల్‌లో నీరు తాగడం వల్ల వచ్చే అనారోగ్య సమస్యల దృష్ట్యా విద్యార్థులకు స్టీల్ వాటర్ ఫ్లాస్కులను పంపిణీ చేస్తున్నట్లు హెల్త్ ఫౌండేషన్ కో–ఆర్డినేటర్ సుబ్రమణ్యం తెలిపారు. స్థానిక గ్రామ పంచాయతీ సర్పంచ్ శ్యామల సుబ్రమణ్యం చేతుల మీదుగా వీటిని అందజేశారు. అపోలో టైర్స్ పరిశ్రమ సేవా కార్యక్రమాలను విద్యార్థుల తల్లిదండ్రులు కొనియాడారు.

మొదలైన వినాయక సందడి


వివిధ రూపాల్లో తయారైన వినాయక విగ్రహాలు

బుచ్చినాయుడుకండ్రిగ: ఈ నెల 27 తేదీ నుంచి వినాయక చవితి ఉత్సవాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో మండలంలోని అన్ని గ్రామాల్లోను సందడి మొదలైంది. బుచ్చినాయుడుకండ్రిగలో పలుచోట్ల గణనాథుల ప్రతిమల విక్రయ కేంద్రాలు ఏర్పాటయ్యాయి. కళాకారులు భారీ సైజు మట్టి గణపతుల ప్రతిమలను విక్రయాలకు సిద్ధం చేశారు. బొజ్జ గణపయ్యలు వివిధ ఆకృతులు, ప్రత్యేక రంగులతో కమల గణనాథుడు, సర్ప గణనాథుడు, శ్రీకృష్ణ రూపం, నెమలి, రాజహంస, సింహాసన, వాహనాలతో పాటు గజరాజు, నంది, శంఖు, మూషికం, శివస్వరూప, ప్రతిమలు ఆకట్టుకుంటున్నాయి. విగ్రహాల సైజును బట్టి వంద నుంచి రూ. 30 వేల వరకూ ధరల్లో ఉన్నట్లు చెప్పారు. విగ్రహాల కొనుగోలుకు ఉత్సవాల నిర్వాహకులు అడ్వాన్సులు చెల్లిస్తున్నారు. గతంలో ఎన్నడూ లేనివిధంగా మట్టి విగ్రహాల కొనుగోలుకు ఆసక్తి చూపుతున్నారు.

తానా బహుమతులు పొందిన బాలల నవలలు ఆవిష్కరణ


బాలల నవలలను ఆవిష్కరిస్తున్న ఎస్వీ వేదికవర్శిటీ వీసీ, ప్రముఖ సాహితీవేత్తలు

తిరుపతి కల్చరల్: రచయితలు ఆర్‌సీ.కృష్ణస్వామి రాజు, పేట యుగంధర్ రచించిన 'మునికిష్టడి మాణిక్యం', 'జాను అను నేను–నాస్నేహితురాళ్లు' నవలలను ఎస్వీ వేదిక్ వర్సిటీ ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి చేతుల మీదుగా ఆదివారం ఆవిష్కరించారు. వేమన విజ్ఞాన కేంద్రంలో ఈ కార్యక్రమం నిర్వహించారు. ఇటీవల ప్రతిష్టాత్మక తానా అంతర్జాతీయ సాహిత్య సంస్థ (అమెరికా) నిర్వహించిన తాను–మంచి పుస్తకం బాలల నవలల పోటీలో బహుమతిని ఈ పుస్తకాలు పొందాయి. ఆచార్య పీసీ.వెంకటేశ్వర్లు 'జాను అనే నేను–నాస్నేహితురాళ్లు' పుస్తకాన్ని సమీక్షించారు. సమకాలీన బాల సాహిత్యంలో సామాజిక స్పృహ, చదువు ప్రాముఖ్యతను, ప్రధానంగా ప్రభుత్వ పాఠశాలల్లో బోధన విశిష్టతను తెలియజేసే గొప్ప నవలగా అభివర్ణించారు. మునికిష్టడి మాణిక్యం నవలను డాక్టర్ జి.లక్ష్మీప్రియ సమీక్షిస్తూ..రచయిత పుత్తూరు శల్య వైద్య కట్టు ప్రాముఖ్యతతో పాటు స్థానిక జన జీవితాన్ని హాస్య భరితంగా పరిచయం చేశారని విశ్లేషించారు. కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్తలు జొన్న విత్తుల రామచంద్రమూర్తి, ఆకుల మల్లేశ్వరరావు, డాక్టర్ గంగిశెట్టి శివకుమార్, డాక్టర్ వీఆర్.రాసాని, కొత్వాల అమరేంద్ర, జిల్లేళ్ల బాలాజీ, తోట వెంకటేశ్వర్లు, నెమిలేటి కిట్టన్న, మన్నవ గంగాధర్‌ప్రసాద్, మల్లారపు నాగార్జున, కేవీ.మేఘనాథ్‌రెడ్డి, పల్లిపట్టు నాగరాజు, డాక్టర్ యువశ్రీ, డాక్టర్ స్వరాజ్యలక్ష్మి, సురేంద్ర రొద్ద పాల్గొన్నారు.

సేవతోనే సంతృప్తి


దివ్యాంగులకు నిత్యావసర సరుకులు అందజేస్తున్న ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి

శ్రీకాళహస్తి: సేవతోనే సంతృప్తి లభిస్తుందని శ్రీకాళహస్తి ఆర్డీవో భానుప్రకాష్‌రెడ్డి అన్నారు. పట్టణంలోని నగరివీధిలోని హెల్పింగ్‌హ్యాండ్స్ సంస్థ ఆదివారం నిత్యావసర సరుకులను వృద్ధులు, దివ్యాంగులకు అందజేశారు. దీనికి ముఖ్యఅతిథిగా హాజరైన ఆయన మాట్లాడుతూ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ సేవలను కొనియాడారు. సోమవారం నుంచి స్మార్ట్ రేషన్‌కార్డులు పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. శ్రీకాళహస్తిలో సుమారు 11వేల కార్డులు వచ్చాయని వాటిని ఐదు రోజుల పాటు ప్రజలకు పంపిణీ చేస్తామన్నారు. ప్రజలు ఇళ్ల వద్ద ఉంటే రెవెన్యూ సిబ్బంది ఈకేవేసీ చేసి స్మార్ట్ రేషన్ కార్డులను అందజేస్తారన్నారు. ప్రజల ఇళ్ల వద్దనే ఉండి వీటిని అందుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో సంస్థ వ్యవస్థాపకులు మునీర్‌బాషా, సభ్యులు రాజేశ్వరరావు, గరికపాటి రమేష్‌బాబు, కంఠా ఉదయ్‌కుమార్, హరినాథ్‌నాయుడు, యువకిషోర్, బాబా ఫరీద్ తదితరులు పాల్గొన్నారు.

ఫైనాన్స్ సిబ్బంది చేతివాటంపై ఫిర్యాదు

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో సిబ్బంది చేతివాటం ప్రదర్శించారు. కస్టమర్లకు తెలియకుండానే వారి పేర్లమీద లోన్లు మంజూరు చేసి ఇతర వ్యక్తులకు పరికరాలు అందించారు. ఈఎంఐ చెల్లించాలని కస్టమర్ కేర్ నుంచి ఫోన్ రావడంతో బాధితులు అవాక్కయ్యారు. వాస్తవాలు ఆరా తీయగా.. పట్టణంలోని పలు షోరూమ్‌ల నుంచి కొంతమందికి తమ పేరు మీద లోన్ తీసుకుని పరికరాలను డెలివరీ చేసినట్లు తెలిసిందని బాధితులు వాపోతున్నారు. దీంతో రూ.లక్షల్లో మోస పోయినట్లు ఆరోపించారు. ఈ మేరకు 8 మంది బాధితులు ఆదివారం హుటాహుటిన పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సాయి భక్తులకు మంచి సేవలు అందిస్తాం


హాజరైన సాయి సేవకులు


మాట్లాడుతున్న ప్రముఖులు

శ్రీకాళహస్తి: సత్యసాయి భక్తులకు మంచి సేవలు అందిస్తామని పలువురు ప్రముఖులు అన్నారు. పుటపర్తిలో శ్రీసత్యసాయి 100వ జయంతి వేడుకల్లో చేపట్టనున్న సేవా కార్యక్రమాలపై సేవలపై ఆదివారం నిర్వాహకులు దిశానిర్దేశం చేశారు. పట్టణంలోని ముత్యాలమ్మగుడివీధిలో ఉన్న సాయిబాబా మందిరంలో ఆదివారం తిరుపతి జిల్లాలోని సాయి సేవకులకు జిల్లా స్థాయి సేవాదళ్ శిక్షణ శిబిరం నిర్వహించారు. శ్రీసత్య సాయి సేవా సంస్థ రాష్ట్ర ఉపాధ్యకులు చుండూరు సురేంద్ర, రాష్ట్ర సేవా కో–ఆర్డినేటర్ శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ పుటపర్తిలోని ప్రశాంతి నిలయానికి లక్షలాది మంది భక్తులు వస్తారన్నారు. కార్యక్రమంలో విశ్వనాథరెడ్డి, స్నేహలత, అమర్నాథ్, పాండురంగయ్య తదితరులు పాల్గొన్నారు.



అరిగిలకండ్రిగ వద్ద అధ్వాన్నంగా రోడ్డు

- ఐదు నెలలకే లేచిపోయిన ప్యాచ్‌లు
- నాణ్యత లేని మరమ్మతులు

బుచ్చినాయుడుకండ్రిగ: ఇది శ్రీకాళహస్తి–తడ రోడ్డు, చెన్నైకు వెళ్లే ప్రధాన రహదారి. శ్రీకాళహస్తి–బుచ్చినాయుడుకండ్రిగ, ఎన్‌టీఆర్ నగర్ వరకు 30 కిలోమీటర్ల రోడ్డుకు గత మార్చిలో గుంతలకు ప్యాచ్‌వర్క్‌లు చేశారు. వర్షాలు పడుతుండటంతో ప్యాచ్‌లు లేచిపోవడంతో మళ్లీ గుంతలు దర్శనమిస్తున్నాయి. ప్రస్తుతం ఈ గుంతలు గతంలో కంటే పెద్దగా మారడంతో వాహనదారులు ఇబ్బంది పడుతున్నారు. ప్యాచ్ వర్క్‌ల పేరిట లక్షల రూపాయలు కరిగిపోతున్నా గుంతలు మాత్రం మాయం కావడం లేదు. ఈ మార్గంలో వాహనాల్లో వెళ్లే అధికారులు, ప్రయాణికులకు గుంతల మూలాన అవస్థల ప్రయాణం తప్పడం లేదు.


గుంతలమయంగా ఉన్న రోడ్డు


కాటూరు వద్ద రోడ్డుపై కానరాని ప్యాచ్‌వర్క్

అభ్యుదయవాది అన్నమయ్య

- అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ లత

తిరుపతి కల్చరల్: సమాజంలోని అసమానతలను తన పదాలతో నిరసించిన అభ్యుదయ వాది అన్నమయ్య అని అన్నమాచార్య ప్రాజెక్టు డైరెక్టర్ డాక్టర్ సి.లత కీర్తించారు. విశ్వామిత్ర సర్వీస్ సొసైటీ ఆధ్వర్యంతో కేటీ రోడ్డులోని అరవింద సొసైటీలో 'శ్రీవారి సంకీర్తన వసంత వరప్రసాదిని' అన్నమయ్య సంకీర్తనల ఆల్బం ఆవిష్కరణ సభ నిర్వహించారు. ముఖ్య అతిథిగా లత ఈ ఆల్బంను ఆవిష్కరించి మాట్లాడారు. అన్నమయ్య భక్తి సంకీర్తనలతో పాటు జానపద, ఆధ్యాత్మిక, శృంగార సంకీర్తనలను అందరికీ అర్థమయ్యే రీతిలో రచించారని, ప్రతి నోటా అన్నమయ్య కీర్తనలు వినిపించేలా తమ ప్రాజెక్టు కృషి చేస్తోందన్నారు. 70 ఏళ్ల వయస్సులో తలుపూరు వెంకట శేష వరప్రసాద్ అన్నమయ్య సంకీర్తనలను నేర్చుకుని, స్వయంగా గానం చేసి, ఆల్బం రూపొందించడం అభినందనీయమన్నారు. అధ్యక్షత వహించిన ప్రముఖ రచయిత రామస్వామి రఘుపతి మాట్లాడుతూ, ఆధ్యాత్మిక చింతన, యోగ సాధనతో జీవితాలను సుఖమయం చేసుకోవడానికి అన్నమయ్య సంకీర్తనలు ఎంతగానో ఉపకరిస్తాయన్నారు. అనంతరం విశ్వామిత్ర సర్వీస్ సొసైటీ వ్యవస్థాపక కార్యదర్శి డాక్టర్ కే.సుబ్రమణ్యం కళాకారులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో టీటీడీ బ్రాడ్ కాస్టింగ్ ఏఈ మల్లం విజయ్‌కుమార్‌రెడ్డి, ప్రముఖ రంగస్థలి నటుడు బొందు రామచంద్రారెడ్డి, స్వరభారతి ప్రధాన కార్యదర్శి కొమాండూరి శరద్యుతి, ప్రముఖ గేయ రచయిత జిల్లేళ్ల ప్రసాద్, కళాకారులు నాయని మధు, రమ్యకృష్ణ, రాగసుధ, గంగులప్ప, నగర ప్రముఖులు పాల్గొన్నారు.


అన్నమయ్య సంకీర్తనల ఆల్బం ఆవిష్కరిస్తున్న అతిథులు, నిర్వాహకులు

నేడు జీఎస్టీ, ఇన్‌కంట్యాక్స్ చట్టాలపై అవగాహన సదస్సు

తిరుపతి కల్చరల్: జిల్లా ట్యాక్స్ ప్రాక్టీషనర్స్ అండ్ కన్సల్టెన్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం హోటల్ ఉదయ్ ఇంటర్నేషనల్‌లో ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు జీఎస్టీ, ఇన్‌కంట్యాక్స్ చట్టాలపై అవగాహన సదస్సు నిర్వహిస్తున్నట్లు అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి టి.శ్రీనివాసులురెడ్డి తెలిపారు. ఆదివారం ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. దేశం, రాష్ట్రం అభివృద్ధి పన్నుల వసూళ్లపై ఆధారపడి ఉంటుందని, ఈ నేపథ్యంలో మారుతున్న కాలానికి అనుగుణంగా జీఎస్టీ, ఇన్‌కంట్యాక్స్ లో చట్టాల్లో వస్తున్న మార్పులపై సమగ్ర అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ దిశగా ప్రముఖ నిపుణులతో అవగాహన సదస్సు ఏర్పాటు చేశామని, జిల్లాలోని ట్యాక్స్ ప్రాక్టీషనర్స్, కన్సల్టెన్స్ హాజరు కావాలని కోరారు. సమావేశంలో అసోసియేషన్ ప్రతినిధులు ఎంఏ.సునీల్ అహ్మద్, ఎస్.అరుణ్‌కుమార్, ఆర్.మునిక్రిష్ణయ్య, ఆర్.చంద్రశేఖర్ పాల్గొన్నారు.

జోరుగా వరికోతలు


నెలవాయిలో ధాన్యాన్ని ఎండబెడుతున్న రైతన్నలు

బుచ్చినాయుడుకండ్రిగ: మండలంలోని నెలవాయి, కల్లివెట్టు, తలారివెట్టు, వేణుగోపాలపురం, కమ్మవారికండ్రిగ, వెస్టువరత్తూరు గ్రామాల్లోని రైతులు జోరుగా వరికోతలు కోస్తున్నారు. ఈ గ్రామాల్లో ఖరీఫ్ సీజన్‌లో రైతులు 1,750 ఎకరాల్లో వరి సాగు చేశారు. తెలుగుగంగ నీటితో చెరువులు నిండాయి. చెరువుల్లోని నీటితో పంటలు బాగా పండాయి. పంటను ముందుగా వేయటంతో కోత పనులు త్వరగా మొదలెట్టారు. ఖరీఫ్ సీజన్‌లో పంటలకు తెగుళ్ల తక్కువగా రావడంతో దిగుబడి పెరిగింది. ఎకరాకు 25 నుంచి 30 బస్తాలు అవుతున్నాయి. ధాన్యానికి మార్కెట్‌లో ధర లేకపోవడంతో ఆదాయం తగ్గిందని, గత ఏడాది ధాన్యం మంచి రేటు పలికిందని రైతులు చెప్పారు. ప్రస్తుతం వరికోతల్లో రైతులు బిజీబిజీగా ఉన్నారు.


కల్లివెట్టులో వరిని కోస్తున్న యంత్రం